క్లుప్తంగా

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేవీ సత్యనారాయణమూర్తి అరెస్ట్ అక్రమం

అల్లిపురం: ఎల్‌జీ పాలిమర్స్ పేలుడులో మరణించిన వారి తరఫున ఆందోళన చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తిని అరెస్టు చేయడం అక్రమం అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు ఒక ప్రకటనలో ఖండించారు. ఆనాటి కేసులో కోర్టుకు హాజరు కాలేదన్న నెపంతో గోపాలపట్నం పోలీసులు శుక్రవారం ఉదయం ఆయన ఇంటికి వెళ్లగా, ఈ రోజే రీకాల్ పెట్టుకుంటామని చెప్పినా వినకుండా అరెస్ట్ చేయడం తగదన్నారు. నిత్యం ప్రజల సమస్యలపై పోరాడుతున్న నాయకులను దోషులను అరెస్ట్ చేసినట్లు చేయడం దుర్మార్గమన్నారు. అనేక కేసుల్లో ఉన్న దొంగలు, దోపిడీదారులు, ఖూనీకోరులు, రౌడీలను వదిలిపెట్టి ప్రజా నాయకులను అరెస్టు చేయడం సరి కాదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేసులను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని పైడిరాజు డిమాండ్ చేశారు.

బల్లిగిరి వెంకన్నకు పూజలు



విశేష అలంకరణలో బల్లిగిరి వెంకన్న

అల్లిపురం: బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం విశేషంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టారు. అనంతరం వెంకన్నను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్ర నామాలతో సహస్ర నామార్చనలు చేశారు.


బయోడైవర్సిటీ పార్క్ సందర్శన



బయోడైవర్సిటీ పార్క్‌లో విద్యార్థులు

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను శనివారం ఓ ప్రైవేట్ ఫార్మసీ కాలేజీ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పార్క్ నిర్వాహకుడు రామామూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను తెలియజేశారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతావరణం గురించి వివరించారు. విద్యార్థులు పార్కులోని మొక్కలను తిలకించి సందడి చేశారు.

దిగి వచ్చిన వెల్లుల్లి ధర



వెల్లుల్లిపాయలు

జగదాంబ: నిన్న మొన్నటి వరకు కిలో వెల్లుల్లి కొనాలంటే ఆలోచించాల్సి వచ్చేది. అల్లం, వెల్లుల్లి ధరలు వింటేనే షాక్ తగిలేది. వెల్లుకి కిలో రూ. 550 వరకు కూడా అమ్మకాలు జరగడంతో కూరల్లో అల్లం, వెల్లుల్లి ముద్ద వేసుకోవడానికి వెనుకాడే పరిస్థితి. అటువంటి వెల్లుల్లి ఇప్పుడు ఒక్కసారిగా కొండ దిగి వచ్చింది. కిలో రూ. 80, మరి కొన్ని ప్రాంతాల్లో వెల్లుల్లి సైజ్‌ను బట్టి కిలో రూ. 100 నుంచి రూ. 120 వరకు విక్రయిస్తున్నారు. అలాగే కిలో రూ. 220 ఉండే అల్లం ధర ఇప్పుడు రూ. 60కి దిగింది.

శారీరక శ్రమ.. ఆరోగ్య ధీమా







జాగింగ్ చేస్తున్న యువకులు



ఇందిరా మున్సిపల్ స్టేడియంలో వాకర్ల సందడి

జగదాంబ: కొద్దిసేపు వాకింగ్, జాగింగ్, వ్యాయామం ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కోవిడ్ తర్వాత చాలా మందిలో ఆరోగ్య పరిరక్షణ పట్ల మక్కువ పెరిగింది. జిమ్‌లకు వెళ్లడం, నలుగురైదుగురు కలిసి నడవడం, యోగా, ధ్యానం వంటివి చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ఏదో ఒక సమయాన్ని వీటికి కేటాయిస్తున్నారు. ఒకప్పుడు మహిళలు వాకింగ్ చేయడానికి ఆసక్తి చూపేవారు కాదు. దీని కోసం ప్రత్యేకంగా బయటికి వెళ్లాల్సి వస్తుందనుకునేవారు. అయితే మారిన కాలంతో పాటు వారిలోనూ మార్పు వచ్చింది. పార్కులు, ఓపెన్ జిమ్‌లలో నడక, చిన్నపాటి వ్యాయామాలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు ఇప్పుడు ఔత్సాహికులతో కళకళలాడుతున్నాయి. వైద్యులు కూడా ఏ వయసు వారైనా నడవాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఉదయం, సాయంత్రం అన్ని వయసుల వారు వాకింగ్ చేస్తున్నారు. యువత, పిల్లలు క్రికెట్, ఫుట్‌బాల్ వంటి క్రీడలతో బిజీగా గడుపుతున్నారు. జీవీఎంసీ 29, 30, 31, 32, 33, 34, 35, 36, 37, 38, 39 వార్డుల్లోని మహిళలు దగ్గరలో ఉన్న స్టేడియంలో వాకింగ్ చేస్తున్నారు.

ఓపెన్ జిమ్‌కు వెళ్తే సరి..



డబ్బులు కట్టి జిమ్‌లకు వెళ్లలేని వారు పలు ప్రాంతాల్లోని ఓపెన్ జిమ్‌లకు వెళ్తే సరి. అక్కడ నడవడానికి, వ్యాయామాలు చేసుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాకింగ్, ఎక్సర్‌సైజ్ రెండూ పూర్తవుతాయి. జిమ్‌కు వెళ్లడానికి కాస్త సమయం కేటాయిస్తే అనుకున్నట్లు వెళ్లి రావచ్చు.

– దీప్తి, జీవీఎంసీ 39వ వార్డు

బాక్సింగ్ నేర్పిస్తా..



మున్సిపల్ స్టేడియంలో బాక్సింగ్ నేర్పిస్తున్నాను. బాక్సింగ్ కోచ్‌గా పిల్లలకు అరగంట జాగింగ్ తర్వాత శరీరం అంతా ఫ్రీ అవడానికి ఎక్సర్‌సైజ్‌లు చేయిస్తాం. బాక్సింగ్‌కు ముందు ఇలా చేయించడం వల్ల పిల్లలు చురుగ్గా ఉంటారు. వాకర్లు, బాక్సర్లతో మున్సిపల్ స్టేడియం సందడిగా ఉంటుంది.

– దుర్గ, బాక్సింగ్ కోచ్, కల్లుపాకలు

నడక, వ్యాయామం చేస్తాను..



మాది జీవీఎంసీ 35వ వార్డులోని కల్లుపాకలు ప్రాంతం. పక్కనే ఇందిరా మున్సిపల్ స్టేడియం ఉండడం వల్ల మొదట్లో అందరితో కలిసి స్టేడియంకు వెళ్లేవాళ్లం. తర్వాత అలవాటు అయిపోయింది. ఇప్పటికి నలభై అయిదు సంవత్సరాలుగా నడక, వ్యాయామం చేస్తున్నాను.

– రమేష్, వాకర్, జీవీఎంసీ 35వ వార్డు



వ్యాయామం చేస్తున్న మహిళలు

రోజూ వాకింగ్ చేస్తా..



రోజూ ఇందిరా మున్సిపల్ స్టేడియంలో వాకింగ్ చేస్తాను. ఇక్కడ వాకింగ్ అయిపోయిన తర్వాత పిల్లలకు రన్నింగ్ పోటీలు పెడుతుంటాను. అలాగే చిన్నచిన్న వ్యాయామాలు చేయిస్తాను. దీని వల్ల పిల్లలతో పాటు పెద్దవాళ్లకు కూడా శారీరక శ్రమ దొరుకుతుంది. ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది.

– రమ్య, వాకర్, జీవీఎంసీ 39వ వార్డు

శారీరక శ్రమ ముఖ్యం..



మహిళలైనా.. పురుషులైనా కొద్దిపాటి శారీరక శ్రమ ముఖ్యం. ఓపెన్ జిమ్ములు ఎక్కడ పడితే అక్కడే ఉన్నాయి. తీరిక చేసుకుని వెళ్లి వ్యాయామం చేస్తే ఎన్నో లాభాలు. ముఖ్యంగా రోజూ ఏదో ఒక సమయంలో నడిస్తే ఆరోగ్యం బాగుంటుంది. కొద్దిసేపు సమయం కేటాయించి అంతా నడవాలి.

– పద్మ, జీవీఎంసీ 34వ వార్డు

కూటమి బడ్జెట్ అంకెల గారడీ



సత్యనారాయణ

అల్లిపురం: కూటమి ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ అంకెల గారడీ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ అన్నారు. సూపర్ సిక్స్‌కు అంతంత మాత్రపు కేటాయింపు చూస్తుంటే ప్రజల సంక్షేమానికి తీసుకుంటున్న శ్రద్ధ ఏమిటో అర్థమవుతుందన్నారు. రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ అని గొప్పలు చెప్పడం తప్ప ప్రజల అవసరాలకు తగిన విధంగా కేటాయింపులు లేవన్నారు. తల్లికి వందనం గత ఏడాది లేదు. ఈ ఏడాది కోత విధించారన్నారు. నిరుద్యోగులకు భృతి అంటూ ఊదరగొట్టిన బాబు ఆ ఊసే ఎత్తలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు అంటూ గొప్పలు చెప్పిన బాబు ఆ హామీని మరిచిపోయారన్నారు. నది దాటేదాక ఓడ మల్లన్న, నది దాటాక బోడి మల్లన్న అన్నట్లు ఉంది బాబు తీరు అని ఆరోపించారు.

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి హుండీ ఆదాయం రూ.2.23 లక్షలు



నీలమ్మ వేపచెట్టు అమ్మవారు

అల్లిపురం: అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం హుండీ ద్వారా 80 రోజులకు రూ.2,23,085 ఆదాయం లభించిందని ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం ఈవో కొవ్వూరి గాయత్రి ఇన్స్‌పెక్టర్‌గా వ్యవహరించారు. శ్రీ హరి సేవా సభ్యులు, ఆలయ అర్చకుడు జోగారావు శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రింటర్లు పని చేయవు.. సర్టిఫికెట్లు రావు

- ఇదీ సచివాలయాల దుస్థితి



సీతమ్మధార సచివాలయంలో పని చేయని ప్రింటర్

సీతమ్మధార: విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలో గల పలు సచివాలయాల్లో ప్రింటర్లు పడకేశాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జీవీఎంసీ పరిధి 14వ వార్డు సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో గల సచివాలయంలో నెలల తరబడి ప్రింటర్లు పని చేయకున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాలు నిర్వీర్యం అవుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. వాస్తవానికి సచివాలయాల్లో జారీ చేసే కుల, ఆదాయ, కుటుంబ ధ్రువపత్రాల ప్రింట్లు ఇవ్వాల్సి ఉంటుంది. కాని ప్రింటర్లు పని చేయకపోవడంతో సచివాలయం సిబ్బంది సర్టిఫికెట్ల వెనుక స్టాంపు వేసి సంతకాలు చేసి బయట నెట్ సెంటర్‌లో ప్రింట్ తీసుకోండంటూ సర్టిఫికెట్లను వాట్సాప్ రూపంలో పంపుతున్నారని పలువురు వాపోతున్నారు. ఈ విషయంలో కొందరు సిబ్బందితో వాగ్వాదాలకు దిగుతున్నారని సమాచారం. రేసపువానిపాలెం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, నక్కవానిపాలెం తదితర ప్రాంతాల్లో గల సచివాలయాల్లో కూడా ప్రింటర్లు పని చేయని దుస్థితి నెలకొంది. జోనల్ కార్యాలయం సిబ్బంది స్పందించకపోవడంతో ప్రింటర్ల మరమ్మతులకు చేతి చమురు వదులుతోందని సచివాలయం సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. దీంతో ఉన్నత తరగతుల్లో చేరాలంటే కులం, ఆదాయం తదితర ధ్రువపత్రాలు ఎంతైనా అవసరం. దీంతో తల్లిదండ్రులు ముందు జాగ్రత్తగా సచివాలయాల్లో ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. తీరా అక్కడ ప్రింటర్లు పని చేయడం లేదని తెలిసి నిరాశగా ఇంటర్నెట్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్–3 అధికారులు స్పందించి సచివాలయాల్లో ప్రింటర్లకు మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

బాబాపు సేవా సంఘం తొలి సమావేశం



సమావేశంలో పాల్గొన్న బాబాపు సేవా సంఘం సభ్యులు

సీతమ్మధార: ఇటీవల ఏర్పడిన బాబాపూ సేవా సంఘం సలహా మండలి తొలి సమావేశం శనివారం ఉదయం సంఘం కార్యాలయ ప్రాంగణంలో అధ్యక్షులు అంతర్వేది అధ్యక్షతన జరిగింది. తొలుత కార్యదర్శి రమణి నివేదిక సమర్పించారు. సేవా సంఘం కార్యక్రమాలు విస్తృతపరచాలని నిర్ణయించారు. అలాగే పేద బాలలు, తల్లులకు ఆరోగ్య శిబిరాలు, బ్లాక్ పెయింటింగ్ క్లాస్‌లు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని తీర్మానించారు. నిధులు సేకరించి నూతన కార్యక్రమాలు చేపట్టాలని పలువురు సభ్యులు సూచించారు. కార్యదర్శి రమణి వందన సమర్పణ చేశారు. ఈ సమావేశంలో సలహా మండలి సభ్యులు ఆచార్య వి.బాల మెహన్‌దాస్, నరవ ప్రకాశరావు, చల్లా మహాలక్ష్మి, అవసరాల శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కామేశ్వరరావు, డాక్టర్ మురళీరావు, ఉషారెడ్డి, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం న్యాయ పోరాటానికి సిద్ధం

- అక్రమ అరెస్టులకు భయపడం
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



వాసుపల్లిని కలిసిన కాకి పద్మ తదితరులు

దాబాగార్డెన్స్: ప్రజల కోసం న్యాయ పోరాటం చేస్తామని, అక్రమ అరెస్టులకు భయపడేదే లేదని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షురాలు కాకి పద్మ శనివారం ఆశీల్‌మెట్టలో గల వాసుపల్లి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా ఆయనను కలిసి వాసుపల్లికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు. కాకి పద్మ మాట్లాడుతూ తనకు అవకాశం ఇచ్చిన పార్టీ పెద్దలు, వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జగనన్న సారథ్యంలో ప్రజా సేవకుడు వాసుపల్లి మళ్లీ అధికారంలోకి రావాలని అభిలషించారు. చేనేత కార్మికులకు అండగా నిలవాలని, ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూడాలన్నారు. అక్రమ అరెస్టులకు ఎవరూ భయపడొద్దని, మనకు అండగా పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డితో పాటు వాసుపల్లి కూడా అండగా ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, జిల్లా వాణిజ్య విభాగం ప్రతినిధి సకలాభక్తుల ప్రసాద్, సౌత్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్‌కుమార్, దశమంతుల మాణిక్యాలరావు, వేణు, ఆరుగుల రాజు, రామరాజు, రమణి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో విద్యార్థినుల ప్రతిభ



క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థినులు

దాబాగార్డెన్స్: రాంనగర్‌లో గల ఆదిత్య డిగ్రీ కళాశాల (మహిళా ప్రాంగణం) విద్యార్థినులు క్యాంపస్ ఇంటర్వ్యూలో ప్రతిభ చూపారు. కళాశాల ప్రాంగణంలో శనివారం ఇన్ఫోసిస్ (ఐటీ)నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 55 మంది విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ షాహిద్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను ఆయన అభినందించారు. తమ విద్యార్థినులకు డిగ్రీతో పాటు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. ప్రిన్సిపాల్, సిబ్బందిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎస్. సుగుణరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు అభినందించారు. కార్యక్రమంలో ప్రాంతీయ సంచాలకుడు పి. రామకృష్ణారెడ్డి, నోడల్ అకడమిక్ ఆఫీసర్ ఎన్. వెంకటరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. హిమశేఖర్, ప్లేస్‌మెంట్ అధికారి ఎం. బ్యూల, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతరానికి నాంది స్త్రీశక్తి

- మహిళా జర్నలిస్ట్‌లకు విశిష్ట ప్రతిభా పురస్కారాలు



సత్కారం పొందిన పాత్రికేయులతో అతిథులు

దాబాగార్డెన్స్: నవతరానికి స్త్రీ శక్తి నాంది అని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సతీమణి శుభోశ్రీ బాగ్చి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మహిళా మీడియా ప్రతినిధుల సత్కార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వ మనుగడలో స్త్రీ పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. సీబీడీ ప్రాంతీయ ఉన్నతాధికారి ప్రేమ్ కాజల్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు మగవారితో పోటీ పడుతూ సత్ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. మహిళా సామాజిక చైతన్యానికి తోడ్పడే వార్తా కథనాలు విస్తృతంగా జర్నలిస్టులు అందించాలని పిలుపునిచ్చారు. ఆయా కథనాలు రాసినప్పుడు జాగ్రత్తలు పాటించి సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమ నిర్వాహకురాలు బ్రహ్మకుమారి రామేశ్వరి మాట్లాడుతూ ఎక్కడైతే మహిళలు సంతోషంగా ఉంటారో, అక్కడ ప్రగతి ఛాయలు కనిపిస్తాయన్నారు. 15 మంది మహిళా జర్నలిస్టులకు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశిష్ట ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, సీనియర్ పాత్రికేయుడు నాగరాజ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వంటల పోటీలు



విజేతలను ప్రకటిస్తున్న న్యాయ నిర్ణేతలు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వంటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో 60 మంది మహిళలు పాల్గొన్నారు. అటుకులతో తయారు చేసిన స్వీట్స్, హాట్ వంటకాలను మహిళలు ప్రదర్శించారు. హోటల్ మేనేజ్‌మెంటు నిపుణులు అబ్దుల్ ముజాహీద్, దువ్వాడ లక్ష్మీభార్గవి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల్లో పాల్గొన్నవారిలో అరుణ, చంద్రిక, నాగేశ్వరి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు. ఎం.పార్వతి, ఎ.పద్మలతలను కన్సొలేషన్ బహుమతులకు ఎంపిక చేసినట్లు అధ్యక్షురాలు కె.మాధవి చెప్పారు. విజేతలకు బహుమతులు ఈనెల 5న నిర్వహించనున్న మహిళా దినోత్సవంలో అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.కమల, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

5 నుంచి రేణుక యల్లమ్మ అమ్మవారి జాతర



రేణుక యల్లమ్మఅమ్మవారు



అమ్మవారి ఆలయం

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్, అచ్చియ్యమ్మపేటలో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి 25వ వార్షిక జాతర ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం తెలిపారు. ఈ ఏడాది 25వ వార్షికోత్సవం సందర్భంగా 5వ తేదీన బృందావన్ లాడ్జి దరి పీల వెంకట అప్పలనాయుడు ఇంటి వద్ద నుంచి అమ్మవారి ఆభరణాలు మేళతాళాలతో ఊరేగిస్తామని తెలిపారు. 6వ తేదీన తొలేళ్ల ఉత్సవం సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చనలు, దీప, ధూప నైవేద్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 7వ తేదీన అమ్మవారి జన్మనక్షత్రం మృగశిరలో జాతర చేపట్టనున్నట్లు తెలిపారు. అమ్మవారిని అభిషేకించేందుకు సుమారు వంద మంది మహిళలు పోలేరమ్మ సతకం పట్టు నుంచి కలశాలతో తిరువీధి నిర్వహిస్తారన్నారు. సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి అనుపు ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రెండు షాపులపై కేసు



స్వీట్‌షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

సీతమ్మధార : నగరంలోని సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, టీపీటీ కాలనీ తదితర ప్రాంతాల్లోని స్వీట్ షాపులు, హోటళ్లు, కిరాణా దుకాణాల్లో జిల్లా కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ గోవింద, తహసీల్దార్ ఎం.రమేష్ తనిఖీలు నిర్వహించారు. రెండు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ (సర్కిల్–2) ఎస్.గోవింద్, సహాయ కార్మిక అధికారి (సర్కిల్–10) పి.విజయకుమార్, సహాయ కార్మిక అధికారి (సర్కిల్–9) విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసులకు ఉచిత వైద్య సేవలు



డీసీపీ (క్రైమ్) లతా మాధురికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విశాఖ సిటీ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో డీసీపీ (క్రైమ్) లతామాధురి ఆధ్వర్యంలో శనివారం పోలీస్ కల్యాణ మండపంలో అపోలో ఆస్పత్రి వైద్య బృందంతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 220 మంది మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పరీక్షలు చేసుకున్నారు. వీరికి వైద్య పరీక్షలు చేయడమే కాకుండా అవసరమైన వారికి మందులు అందజేశారు.

గైస్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం



మాట్లాడుతున్న కెమ్‌దోసా గౌరవాధ్యక్షుడు పీవీ రంగారావు

మురళీనగర్: కెమికల్ ఇంజినీరింగు ఇన్‌స్టిట్యూట్ (గైస్) అభివృద్ధికి కెమికల్ ఇంజినీరింగ్ డిప్లమా పూర్వ విద్యార్థుల సంఘం (కెమ్‌దోసా) సంపూర్ణ సహకారం అందిస్తుందని సంఘం గౌరవాధ్యక్షుడు పీవీ రంగారావు తెలిపారు. కెమ్‌దోసా 9వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. కాలేజీలో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే అనేక సదుపాయాల కల్పనలో సహాయం అందించినట్లు చెప్పారు. గైస్‌లో విద్యనభ్యసించిన ప్రతి పూర్వ విద్యార్థి తాము చదువుకున్న కాలేజీ రుణం తీర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా గైస్‌లోని నాలుగు బ్రాంచ్‌ల్లో ప్రతిభా వంతులైన విద్యార్థులకు రూ.1.30 లక్షల బహుమతులను కెమ్‌దోసా తరుపున అందించారు. కెమ్‌దోస అధ్యక్షుడు ఏ.వరహాలు, కోఆర్డినేటర్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు ప్రసంగించారు.